సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

దిల్‌సుఖ్‌నగర్: వర్షాకాలంలో వ్యాపించే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్‌కేపురం కార్పొరేటర్ రాధా ధీరజ్ రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని మార్గదర్శికాలనీ, వాసవీకాలనీ తదితర కాలనీల్లో ఆమె పర్యటించారు. కాలనీలలోని సమస్యలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..దోమల వల్ల మలేరియా, డెంగీ, బోదకాలు, చికెన్ గున్యా వ్యాధులు వస్తాయని ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు.

బహుమతుల అందజేత



బహుమతులతో క్రీడాకారులు

ఎల్‌బీనగర్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బృందవన్ మిడోస్ కాలనీలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు మొద్దు కవితాలచ్చిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు పానుగుపాటి శశికాంత్, సభ్యులు జగన్మోహనచారి, వేణు, భాషా, గోపాలకృష్ణ, రవితేజ, రాఘవేంద్ర, సందీప్, నారాయణ, జయచంద్ర పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మన్సూరాబాద్: స్వాతంత్య్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతిని ఎల్‌బీనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. బీజేపీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి, ముత్యంరెడ్డి, పురేందర్, గంగదాసు కృష్ణారెడ్డి, విద్యాసాగర్, సుందర్‌నారాయణ, రమేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూలో చేరిక



మన్సూరాబాద్: ది హైదరాబాద్ మెకానిక్ అండ్ టెక్నికల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నందగిరి ఆంజనేయులు సోమవారం సీఐటీయూలో చేరారు. సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి ఆయనకు కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమానికి పనిచేస్తున్న యూనియన్ సీఐటీయూ అన్నారు. కార్మికుల వేతనాల హక్కుల పోరాటంలో భాగస్వామ్యమై పనిచేస్తానన్నారు.

ప్రమాదకరంగా చెట్టు



మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్ రిలయన్స్ మార్ట్ ఎదురుగా ఫుట్‌పాత్‌పై ఉన్న ఓ చెట్టు వేర్లు బయటకు తేలి ప్రమాదకరంగా మారింది. గతంలో చెట్టు పక్కనే ఉన్న మరో చెట్టు ఆకస్మాత్తుగా కూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడం ప్రమాదం తప్పింది. ఈ చెట్టు కూడా ఎప్పుడు కూలి పడుతుందో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. చెట్టు కిందే చిరువ్యాపారుల డబ్బాలు, ఆటోలు, బైక్‌లు పార్కింగ్ చేస్తుంటారు. పక్కనే రూ. 5 భోజనం కేంద్రం ఉండటంతో ఆ చెట్టు పరిసర ప్రాంతాలలో కూర్చోని భోజనం చేస్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన చెట్టును తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమోటా రూ.33, వంకాయ రూ.23, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.18, బీరకాయ రూ.38, కాలీఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.13, క్యారెట్ రూ.45, దొండ రూ.23, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.22, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.13, సొరకాయ రూ.13, పొట్లకాయ రూ.13, అరటికాయ రూ.11, చిక్కుడు కాయ రూ.40, చామగడ్డ రూ.23, మునగ రూ.23, కందగడ్డ రూ.35, బీట్‌రూట్ రూ.21, కీర రూ.18, బీన్స్ రూ.65, క్యాప్సికమ్ రూ.43. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

ఎనీటైమ్.. ఎనీవేర్

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

- హడలెత్తుతున్న మందుబాబులు
- వాహనదారుల క్షేమం కోసమంటున్న ట్రాఫిక్ పోలీసులు



విజయవాడ జాతీయ రహదారిపై డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

హస్తినాపురం: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారికి ట్రాఫిక్ పోలీసులు చుక్కలు చూపిస్తున్నారు. వనస్థలిపురం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అన్ని ప్రధాన రహదారులు, చౌరస్తాలలో రాత్రీపగలు తేడా లేకుండా డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. విజయవాడ జాతీయరహదారి, ఆటోనగర్, నాగార్జున సాగర్‌రహదారి, సాగర్ కాంప్లెక్స్, కర్నూలు రహదారి మందమల్లమ్మ చౌరస్తా, కుంట్లూరుకు వెళ్లే దారిలోని మదర్‌డెయిరీ దగ్గర ప్రతి రోజు డ్రంకెన్‌డ్రైవ్‌తో మందుబాబులు హడలెత్తుతున్నారు. పట్టుబడిన వారి వాహనాలు సీజ్ చేసి జరిమానాలు విధిస్తున్నారు. ఎల్‌బీనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఆదేశాల మేరకు వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భూపతి గట్టుమల్లు పర్యవేక్షణలో ఎక్కడ పడితే అక్కడ ఆకస్మికంగా తనిఖీలు చేపడుతుండటంతో కొందరు ఉదయం పూట మందుతాగేందుకు జంకుతున్నారు.

అంతర్గత రహదారుల్లోనూ..

వనస్థలిపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లోని చౌరస్తాలలో పాటు ప్రధాన రహదారి కాలనీ అంతర్గత రహదారులు అని తేడా లేకుండా ప్రతీ చోట వాహనదారులను బ్రీత్ ఎనలైజర్స్‌తో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు ముమ్మరం చేస్తున్నారు. ఇది గమనించని కొందరు మందుబాబులు తమ వాహనాలను అక్కడే వదిలి పారిపోతున్నారు. మద్యం తాగితే ఇంట్లో ఉండండి వాహన నడిపితే జైలుకు వెళ్లటం ఖాయం అంటూ మద్యం మత్తులో వాహనాలను నడిపేవారిని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

అనర్థాలపై అవగాహన కల్పిస్తూ..

గతంలో వాహనదారులు పెండింగ్ చలాన్లకు భయపడేవారు. కానీ ప్రస్తుతం వాహనదారులు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలుకు బెంబేలెత్తిపోతున్నారు. మద్యం తాగి వాహనం నడపటం వల్ల కలిగే అనర్థాలపై ట్రాఫిక్ పోలీసులు ఆటో, బస్సు, వ్యాన్ డ్రైవర్లతో పాటు ద్విచక్ర వాహన చోదకులకు చౌరస్తాలో అవగాహన కల్పించటంతో పాటు పాఠశాలలు, కళాశాలలోని విద్యార్థులకు రోడ్డు భద్రత, నియమాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. నిబంధనలు పాటించని వారిపై ఉక్కుపాదం మోపుతున్నారు.



పట్టుబడిన మందుబాబులు

ప్రతిరోజూ నిర్వహిస్తున్నాం..



రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి రోజు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నాం. మద్యంమత్తులో అధికవేగంతో వాహనాలను నడుపుతుండడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొన్ని సార్లు ప్రాణాలు సైతం పోగొట్టుకుంటున్నారు. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు ఒకే దగ్గర కాకుండా ఆకస్మికంగా ఎక్కడిపడితే అక్కడ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తూ పట్టు బడినవారి వాహనాలు సీజ్ చేసి కోర్టులో హాజరు పరుస్తున్నాం.

- భూపతి గట్టుమల్లు-వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

అధికారులతో ఎమ్మెల్యే సమావేశం



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: గడ్డిఅన్నారం డివిజన్ మధురాపురి కాలనీలోని రోడ్డు, డ్రైనేజీ సమస్యలపై సోమవారం వాటర్‌వర్క్స్, జీహెచ్‌ఎంసీ అధికారులతోఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమావేశమై చర్చించారు. రోడ్డు నిర్మాణం జాప్యంపై అధికారులను అడగగా రోడ్డు కింది భాగంలో అండర్‌గ్రౌండ్ విద్యుత్ కేబుల్ ఉండటంతో పనులు ఆలస్యమయ్యాయని బదులిచ్చారు. సమస్య పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనులు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రవీణ్‌కుమార్, జీహెచ్‌ఎంసీ డీఈ వినయ్‌కుమార్, వాటర్‌వర్క్స్ ఏఈ రజిత, ఇతర అదికారులు పాల్గొన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మహేందర్‌రెడ్డి

చంపాపేట: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సీపీఎస్) విధానాన్ని రద్దు చేయాలని జిల్లా పీఆర్‌టీయూ టీఎస్ అధ్యక్షుడు సామల మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం చంపాపేట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ యూనియన్ ప్రధానకార్యదర్శులు మధుసూదన్‌గౌడ్, వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యూనియన్ సభ్యుల సమావేశానికి ఆయన హాజరై సీపీఎస్ రద్దుకు సంబధించిన మహాధర్నా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ..గతంలో ఓల్డ్ పెన్షన్(జీపీఎఫ్) విధానంలో ప్రభుత్వమే పూర్తిగా చెల్లించేదని.. ప్రస్తుతం అమలు పరుస్తున్న సీపీఎస్ విధానంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు సగం ప్రభుత్వం సగం చెల్లించాలనే నిర్ణయం ఉద్యోగులను ఆందోళనకు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 1న ఇందిరా పార్కులో నిర్వహించబడే మహాధర్నాలో ప్రతి ఉపాధ్యాయుడూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు కృష్ణారెడ్డి, రాఘవేందర్, గోవర్ధన్, సత్యారావు, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నరు.

కాలనీవాసులను అప్రమత్తం చేశాం



ఓల్డ్‌మలక్‌పేటలో డ్రైనేజీను పరిశీలిస్తున్న డీసీ, ఏఎంహెచ్‌ఓ

చాదర్‌ఘాట్: హిమాయత్‌సాగర్‌లో గేట్లు తెరచిన నేపథ్యంలో మూసీకి ఆనుకొని ఉన్న కాలనీవాసులను అప్రమత్తం చేశామని మలక్‌పేట సర్కిల్-6 డీసీ అలీ తెలిపారు. సోమవారం ఆయన ఓల్డ్‌మలక్‌పేటలోని మూసీ పరీవాహక ప్రాంతాన్ని ఆయన ఏఎంహెచ్‌ఓతో కలిసి పర్యటించి మాట్లాడారు. డ్రైనేజీ నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. చెత్త కుప్పలు వేయరాదని హెచ్చరించారు. ఎంటమాలజిస్ట్ అధికారులు మూసీ పరీవాహక ప్రాంతాల్లో నిత్యం ఫాగింగ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌ఓ రుద్ర శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థ ఇళ్లకు నోటీసులు

ఏసీపీ గజానంద్

చాదర్‌ఘాట్: మలక్‌పేట సర్కిల్-6 పరిధిలో శిథిలావస్థలో ఉన్న 20 ఇళ్లకు నోటీసులు జారీ చేశామని టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ గజానంద్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రేటర్ కమిషనర్ ఆదేశాల మేరకు మలక్‌పేటలో శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించామన్నారు. అదే విధంగా సెల్లార్ నిర్మాణంలో ఉన్న మూడు ఇళ్ల యజమానులకు నోటీసులు జారీ చేసి అప్రమత్తంగా ఉండాలని సూచించామన్నారు. వర్షాకాలం వరకు సెల్లార్ పనులు ప్రారంభించవద్దని జీహెచ్‌ఎంసీ అనుమతులు లేకుండా నిర్మించిన ఇళ్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు.

ఎమ్మెల్యే రాకముందే ఓపెన్‌జిమ్ ప్రారంభోత్సవం

కాసేపు ఉద్రిక్తత



ఓపెన్ జిమ్‌ను ప్రారంభించిన నిరంజన్ యాదవ్

చంచల్‌గూడ: మాదన్నపేటలో ఓపెన్ జిమ్ ప్రారంభోత్సవంలో ఉద్రిక్తత నెలకొంది. మాదన్నపేట సెక్టార్-1లోని ఉప్పర్‌గూడ ఓంనగర్ కమ్యూనిటీ హాల్లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు. అయితే ప్రారంభోత్సవానికి సంబంధించిన శిలాఫలకంపై ప్రజాప్రతినిధుల పేర్లు కాకుండా ఎంఐఎం పార్టీ నాయకుల పేర్లు రాయించడంపై బీజేపీ నాయకులు అభ్యంతరం తెలిపారు. యాకత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ రాకముందే బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ యాదవ్ జిమ్‌ను ప్రారంభించడంతో కాసేపు ఉద్రిక్తత నెలకొంది.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న మక్బూల్‌జానీ

నాగోలు: గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని నాగోలు సీఐ మహమ్మద్ మక్బూల్‌జానీ సూచించారు. ఆదివారం రాత్రి నాగోలు డివిజన్‌లోని ఎగ్గే మల్లేశం ఫంక్షన్‌హాల్లో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి వినాయక మండపానికి అనుమతి పొందాలని అదే విధంగా ఎలాంటి విద్యుత్, అగ్ని ప్రమాదాలకు గురికాకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిమజ్జన సమయంలో ఫిట్‌నెస్ ఉన్న వాహనాలను మాత్రమే వినియోగించుకోవాలని, మద్యం తాగిన డ్రైవర్లను నిమజ్జన వాహనాలను నడపకుండా చూసుకోవాలన్నారు. నిమజ్జన కార్యక్రమాన్ని అందరూ ఒకే రోజు నిర్వహించుకోవాలని తెలిపారు.

మండపాలకు తరలుతున్న గణపయ్యలు



వినాయకుడిని మండపానికి తరలిస్తున్న దృశ్యం

మలక్‌పేట: గణేష్ ఉత్సవాల సందడి మొదలైంది. మండపాలను భిన్నవిభిన్న ఆకృతుల్లో సిద్ధం చేశారు. మూసారంబాగ్ డివిజన్ శాలివాహననగర్ జైగణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న వృద్ధిసిద్ధి వినాయకుని మండపానికి తరలింపు(ఆగమన వేడుక) ఆదివారం రాత్రి ప్రతాప్‌నగర్ భాష్యం స్కూల్ చౌరస్తా నుంచి శాలివాహననగర్ మ్యాక్సీవిజన్ ఎదురు లైన్ వరకు నిర్వహిచారు. అసోసియేషన్ సభ్యులు ఏకరూప వస్త్రాధారణలో భక్తిగీతాలు, భాజాభజంత్రీలతో వినాయకుని మండపానికి తరలించారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

మీర్‌పేట: గణేష్ ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి మీర్‌పేట సభ్యులు సోమవారం మీర్‌పేట కార్పొరేషన్ డీఈకి వినతిపత్రం అందజేశారు. వినాయక విగ్రహాల తరలింపు, నిమజ్జనం సందర్భంగా అంతరాయం లేకుండా ప్రధాన రహదారులు, కాలనీ అంతర్గత రహదారుల్లోని గుంతలను పూడ్చి మరమ్మతులు చేపట్టాలని, దారికి అడ్డంగా ఉన్న విద్యుత్ తీగలను జరపాలని, చెట్ల కొమ్మలు తొలగించాలని, వీధిదీపాలు వెలిగేలా చూడాలని వారు కోరారు. అదేవిధంగా చెరువుల్లో నిమజ్జనం చేసేందుకు వీలుగా పూడికతీత చేపట్టి, క్రేన్‌లను ఏర్పాటు చేయాలని, నిమజ్జనం 13వ రోజు కూడా ఒక క్రేన్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. భక్తులకు మంచినీటి సదుపాయం కూడా కల్పించాలన్నారు.



సత్కారం



నాగోలు: బీజేపి రంగారెడ్డి జిల్లా అర్బన్ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన వగ్గుల సుందర నారాయణను కార్పొరేటర్ పవన్‌కుమార్ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కుంటున్న సమస్యలను తెలుసుకుంటూ పార్టీ, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్‌గౌడ్, మహేష్‌కుమార్, వైజయంతి, లావణ్య, పింకి సింగ్, స్వర్ణ , పుష్పమ్మ, సాయి, చరణ్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల విక్రేతల అరెస్ట్


చాదర్‌ఘాట్: మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న పలువురిని అరెస్టు చేసిన ఘటన చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం.. మలక్‌పేటకు చెందిన మహమ్మద్ ఇమ్రాన్ అలీ (32) పాన్‌షాప్ నిర్వహిస్తుంటాడు. వ్యసనాలకు బానిసై పలు కేసుల్లో నిందితుడు కావటమే కాకుండా ఇతనిపై రౌడీషీట్ ఉంది. తన స్నేహితుడు ప్రస్తుతం పరారీలో ఉన్న యావర్ సహకారంతో ఢిల్లీ నుంచి మెఫెంటర్‌మైన్ సల్ఫేట్ ఇంజెక్షన్లు తెచ్చుకొని విక్రయిస్తున్నాడు. నల్లకుంటలో మెడికల్ షాప్ నడిపే రంగ శంకర్‌గౌడ్ (65) డ్రగ్స్ తెప్పించి కాచిగూడకు చెందిన అపోలో ఫార్మసీ ఉద్యోగి రితేష్ కుమార్(32)కు అతని సోదరుడు మోహిత్ కుమార్‌కు అమ్మేవాడు. విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు సోమవారం వారిని అరెస్టు చేసి రూ. 1.28 లక్షల విలువైన ఇంజెక్షన్లు స్వాధీనం చేసుకున్నారు.

సీపీఐ నాయకుడు భూపతి సురేష్ మృతి



నాగోలు: సీపీఐ సీనియర్ నాయకుడు భూపతి సురేష్ ఆదివారం రాత్రి బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించారు. నాగోలు డివిజన్ జైపురి కాలనీలో నివసించే ఆయన జైపురికాలనీ సెక్రటరీగా నలుగు పర్యాయాలు, ఉప్పల్ కౌన్సిల్ సభ్యుడిగా, ఏఐవైఎఫ్ఐ నాగోలు అధ్యక్షుడిగా పనిచేశారు. పార్టీ చేపట్టిన అనేక ప్రజా పోరాటాల్లో పాల్గొంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. పేదలకు ఇళ్ల నిర్మాణంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రధాన భూమిక పోషించారు. ఆయన మరణం పట్ల సీపీఐ పార్టీ నాయకులు సంతాపం తెలిపారు. భూపతి సురేష్ పార్థివ దేహానికి సోమవారం మాజీ రాజ్యసభ సభ్యుడు, సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా శ్రద్ధాంజలి ఘటించారు.

పాపన్న గౌడ్ చరిత్ర భావితరాలకు ఆదర్శం



వనస్థలిపురంలో పాపన్న గౌడ్ జయంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చరిత్ర భావితరాలకు ఆదర్శమని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు.సోమవారం వనస్థలిపురంలోని ఏరియా ఆసుపత్రి చౌరస్తాలో దూసరి మధుగౌడ్, సాయికిరణ్‌గౌడ్, పూర్ణచందర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పాపన్న గౌడ్ జయంతిలో సుధీర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. పాపన్న గౌడ్ బహుజనుల కోసం పోరాడిన వీరుడన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర రెడ్డి, నాయకులు జిట్ట రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మి ప్రసన్న, రవికుమార్, కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, కొత్త రవిందర్‌గౌడ్, వేములయ్యగౌడ్, శ్రీధర్‌గౌడ్, కవిత పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్‌లో...



ఎల్‌బీనగర్‌లో పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

మన్సూరాబాద్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకలు ఎల్‌బీనగర్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్, బీజేపీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్ పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో రవీందర్‌గౌడ్, పల్లే గణేష్‌గౌడ్, బొంగు వెంకటేష్‌గౌడ్, కిరణ్‌గౌడ్, రాజుగౌడ్, కిషోర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్‌పై చర్యలు తీసుకోవాలి



బడంగ్‌పేట్: జిల్లాలోని పలు గ్రామాల్లో క్రైస్తవుల కోసం కేటాయించిన భూములను కాజేసే పనిలో పాస్టర్ జాయ్‌తో పాటు మరికొంతమంది కలిసి కుట్రలు చేస్తున్నారని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకొని.. క్రైస్తవులకు కేటాయించిన స్థలాలను కాపాడాలని కోరుతూ.. సోమవారం రాచకొండ కమిషనరేట్‌లో పలు క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో ఫిర్యాదులు చేశారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు మాట్లాడుతూ.. ఇటీవల మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన మందుముల సాయిలు అలియాస్ సాయన్న పాస్టర్లందరినీ కలుపుకొని ఏసుక్రీస్తు నామములను ప్రచారం చేస్తూ అందరి మన్ననలను పొందుతున్నారని తెలిసి సాయన్నపై జాయ్ పాస్టర్ నిరాధార ఆరోపణలను చేస్తున్నారని వాటిని ఖండించారు. మహేశ్వరం నియోజకవర్గంలోని క్రైస్తవుల కోసం కేటాయించిన స్థలాలను జాయ్ పాస్టర్ మరికొంత మంది కబ్జా చేస్తున్నారని ఫిర్యాదులో తెలిపారు. మంత్రులు, రాజకీయ నాయకుల, పోలీసుల అండదండలు ఉన్నాయని బెదిరిస్తూ క్రైస్తవ స్థలాలను కబ్జా చేస్తున్నారన్నారు. జాయ్ పాస్టర్ అతనికి సహకారం అందిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఇచ్చిన వినతిపత్రంలో వారు పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో క్రిస్టియన్ కెమిస్ట్రీ అసోసియేషన్, సిలోఫుల్ గాస్పెల్ సొసైటీ, యునైటెడ్ క్రిస్టియన్ చర్చెస్ అసోసియేషన్, కందుకూర్ మండల్ క్రిస్టియన్ ఫెలోషిప్, బేతాని యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్, ఇబ్రహీంపట్నం కాంస్టెన్సీ పాస్టర్స్ కమిటీల అధ్యక్షులు, పాస్టర్లు, సంఘం సభ్యులు ఉన్నారు.